నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, గురువారం 4 జూలై 2024 | YADADRI BHUVANAGIRI

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

- జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, జూలై 3 : జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు నడిపించేందుకు శక్తివంచన లేకుండా చర్యలు చేపడుతున్నానని జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. భువనగిరి మండలం బస్వాపురం గ్రామంలో జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులు రూ.16.50 లక్షలతో నిర్మించిన బీసీ కమ్యూనిటీ భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సందీప్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఏ ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర చర్యలు చేపట్టామన్నారు. జిల్లా పరిషత్ నిధుల నుంచి చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా ప్రారంభించుకుంటున్నామని తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఈ సందర్భంగా సందీప్‌రెడ్డిని ఎంపీపీ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నరాల నిర్మలావెంకటస్వామి, జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, వైస్ ఎంపీపీ ఏనుగు సంజీవరెడ్డి, మాజీ ఎంపీటీసీ మచ్చ మాలతీనర్సింహగౌడ్, నాయకులు సుబ్బూరు రమేశ్, శివకుమార్ పాల్గొన్నారు.

బస్వాపురంలో బీసీ కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణకు దరఖాస్తులు

సూర్యాపేట అర్బన్, జూలై 3 : హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎస్సీ స్టడీ సర్కిల్‌లో నిర్వహించే సివిల్స్, ప్రిలిమినరీ, మెయిన్స్‌కు 10 నెలల ఉచిత శిక్షణకుగానూ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని స్టడీ సర్కిల్ డైరెక్టర్ చిట్టిపాక రాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రాత పరీక్ష నిర్వహించిన అనంతరం ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగి, అర్హత ఉన్న అభ్యర్థులు TSSTUDYCIRCLE.CO.IN వెబ్ సైట్‌లో ఈ నెల 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూలై 21న హైదరాబాద్‌లో ఎంపిక పరీక్ష ఉంటుందని, పూర్తి వివరాలకు 9989129935 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులు

హాస్టళ్లలో వసతుల కల్పనకు ప్రాధాన్యమివ్వాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, జూలై 3 : వసతి గృహాల్లో నాణ్యతతో మెనూ పాటించాలని, విద్యార్థుల కనీస అవసరాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ హనుమంత్ కె.జెండగే ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం వసతి గృహాల రీజినల్ కో ఆర్డినేటర్ రజని, వసతి గృహాల ప్రిన్సిపాళ్లతో ఆయన సమీక్షించారు. విద్యార్థుల భోజనం, అల్పాహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. డైనింగ్ ఏరియా పరిశుభ్రత చాలా ముఖ్యమని, సరుకులు, స్టోర్ రూమ్ తరచూ పరిశీలించాలని సూచించారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని పొడి వాతావరణంలో వంట సామగ్రి ఉండేలా చూడాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని, ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా వైద్యుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. రీజినల్ కో ఆర్డినేటర్ తరుచూ హాస్టళ్ల పనితీరుపై క్షేత్ర స్థాయి పర్యవేక్షణ ఉండాలని చెప్పారు.

మంచీ చెడులను నిర్ణయించేది కర్మ సిద్ధాంతమే

- మహా సహస్ర అవధాని, పద్మశ్రీ గరికపాటి నరసింహారావు

బొడ్రాయిబజార్, జూలై 3 : ప్రతి మనిషి జీవితంలో మంచీ చెడులను కర్మ సిద్ధాంతమే నిర్ణయిస్తుందని, కర్మ ఫలం ప్రతి ఒక్కరూ అనుభవించాల్సిందేనని మహా సహస్ర అవధాని, పద్మశ్రీ అవార్డు గ్రహీత గరికపాటి నర్సింహారావు అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రవి మహల్‌లో బుధవార రాత్రి ఆయన కర్మ సిద్ధాంతంపై ప్రవచించారు. ప్రతి జీవి జన్మించడానికి కారణం ఆ జీవి అంతకు ముందు చేసిన కర్మ ఫలాలే అన్నారు. చెడు కర్మకు ఫలితం పాపం, పాపానికి దుఃఖః, మంచి కర్మకు ఫలితం పుణ్యం, పుణ్యానికి సుఖం అనుభవించాలని అన్నారు. వాటిని అనుభవించడానికి ప్రతి జీవి జన్మను తీసుకుంటుందని, ఇది హిందూ సనాతన ధర్మం చెప్పే కర్మ సిద్ధాంతమని తెలిపారు. ప్రయత్నం, కర్మను బట్టి ఫలితం ఉంటుందని, గత జన్మలో చేసిన పుణ్యం ఈ జన్మలో ఉపయోగపడుతుందని, మనిషి జీవితానికి జన్మ పత్రిక మూలమని చెప్పారు. తప్పు చేయడం మానవ సహజమని, తప్పును సరిదిద్దుకునే వాడు మహాత్ముడని తెలిపారు. ప్రతి ఓటమి గెలుపునకు మెట్టు అవుతుందని, చిన్నానాటి నుంచే పిల్లలను ర్యాంకుల దిశగా తల్లిదండ్రులు ఇబ్బందులు పెడుతుండడంతో వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, దీంతో తల్లిదండ్రులకు గర్భశోకం తప్పడం లేదని పేర్కొన్నారు. గీతలు, రాతలు ఒట్టి భూటకమని, మంచి పనులు చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని అన్నారు. విజ్ఞానం పొందాలంటే ఎక్కడికో వెళ్లాల్సిన పని లేదని, పెద్దవాళ్ల ముందు ఓ అరగంట కూర్చొని వారితో మాట్లాడితే అపారమైన విజ్ఞానం వస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు చేసిన పాపాలు పిల్లలకు సంక్రమిస్తాయనడంలో నిజం లేదని, అందుకే ధార్మికులు వీటిని వదిలి జీవించడమే ఉత్తమ జీవనగతిగా పేర్కొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బొమ్మిడి అశోక్, తూముల ప్రవీణ్, నూకల శైలేందర్, బొడ్డు శంకర్‌గౌడ్, పట్టణ ప్రముకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రవచనాలు ఇస్తున్న గరికపాటి నర్సింహారావు

ప్రజా సమస్యలపై పోరాడాలి

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్

ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌ను కలిసిన ఉమ్మడి జిల్లా నేతలు

నల్లగొండ ప్రతినిధి, జూలై03(నమస్తే తెలంగాణ) : నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపైన పోరాడుతుండాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పార్టీ నేతలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో బుధవారం మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాకు చెందిన కీలక నేతలు, ప్రజా ప్రతినిధులు కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ వారితో సమావేశమై మాట్లాడారు. ఎన్నికల్లో అమలు సాధ్యం కానీ హామీలతో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతగాక పలురకాల జిమ్మిక్కులతో ప్రజలను పక్కదారి పట్టిస్తూ పబ్బం గడుపుకుంటున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నైజం మరోసారి అర్థమైన ప్రజలు, ఓటేసి పొరపాటు చేశామని నాలుక కరుచుకుంటున్నారని కేసీఆర్ అన్నారు. తెలంగాణలో మున్నెన్నడూ లేనివిధంగా ప్రశాంతమైన పాలన ద్వారా పదేండ్ల పాటు సంక్షేమం, అభివృద్ధిని అందిస్తూ అన్ని వర్గాలకు అండగా నిలబడ్డ బీఆర్ఎస్ పార్టీని తిరిగి తెలంగాణ సమాజం కోరుకుంటున్నదని కేసీఆర్ ఈ సందర్భంగా తెలిపారు. కేసీఆర్ మీద ద్వేషంతో, అసంబద్ధ ప్రకటనలతో, ప్రజా ఆకాంక్షలకు విరుద్ధంగా నడుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలు తిరుగబడే రోజులు త్వరలోనే రానున్నాయని స్పష్టం చేశారు.

అప్పటి వరకు పార్టీ నేతలు, కార్యకర్తలు అంతా ప్రజల్లోనే ఉండాలని సూచించారు. గెలుపు ఓటములకు అతీతంగా తెలంగాణ సమాజం మనకు ఎల్లవేళలా అండగా ఉందని, భవిష్యత్తులోనూ ఉంటుందని కేసీఆర్ ప్రకటించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, రమావత్ రవీంద్ర కుమార్, గాదరి కిశోర్ కుమార్, నల్లమోతు భాస్కర్ రావు, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్ రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, కంచర్ల భూపాల్ రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, నోముల భగత్, బూడిద భిక్షమయ్య గౌడ్, తిప్పన విజయసింహా రెడ్డి, నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, ఒంటెద్దు నర్సింహారెడ్డి, చెరుకు సుధాకర్, అన్నభీమోజు నాగార్జునచారి పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన

నల్లగొండ, జూలై 3 : మండల ప్రాదేశిక సభ్యుల పదవీ కాలం బుధవారంతో పూర్తి కావడంతో గురువారం నుంచి ప్రత్యేకాధికారుల పాలన మొదలవనుంది. ఎంపీటీసీల స్థానంలో ప్రత్యేకాధికారుల నియామకం ఉండనప్పటికీ ఎంపీటీసీగా గెలిచి ఎంపీపీగా ఎన్నికై మండల పరిషత్ అధ్యక్షులుగా కొనసాగుతున్న వారి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించాల్సి ఉంది. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 2019 జూలై 3 తతతతతతతతతనాటికి 31 మండలాలు ఉండగా ఆయా మండల పరిషత్ అధ్యక్షులుగా ఎన్నికైన వారి స్థానంలో ప్రత్యేక పాలన ఉండనుంది. 2019, జూలై 3తో ఎంపీపీల పదవీ కాలం పూర్తి కావడంతో నేటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన షురూ కానుంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ సి. నారాయణ రెడ్డి 31 మండలాలకు సంబంధించి ఒకటి ఆపై ర్యాంకులు కలిగిన జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 31 మండలాల్లో నియమించబడిన ప్రత్యేకాధికారులు గురువారం బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. ఇక జడ్పీటీసీల పదవీ కాలం శుక్రవారంతో పూర్తి కానుండగా జిల్లా పరిషత్ చైర్మన్ స్థానంలో ప్రత్యేకాధికారి బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది. జడ్పీకి ఐఏఎస్ స్థాయి ర్యాంకర్ మాత్రమే ప్రత్యేక అధికారి ఉండాల్సి ఉండగా కలెక్టర్ నారాయణ రెడ్డి ప్రత్యేక అధికారిగా వ్యవహరించనున్నారు.

ముగిసిన ఎంపీటీసీల పదవీ కాలం

- ఒకటి ఆపై ర్యాంకులు కలిగిన వారికి బాధ్యతలు
- రేపటితో జడ్పీటీసీల పదవీ కాలం పూర్తి
- జడ్పీ ప్రత్యేకాధికారిగా కలెక్టర్

రైతుల జీవితాలతో కాంగ్రెస్ చెలగాటం

- రైతు భరోసా ఎటుపాయె..
- కేసీఆర్ పాలనలో సుభిక్షంగా రైతులు
- మాజీ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

మీడియాతో మాట్లాడుతున్న మాజీ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

మోటకొండూర్, జూలై 3 : రైతులకు పెట్టుబడి సాయం అందించకుండా కాంగ్రెస్ సర్కారు రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నదని మాజీ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. నిత్యం జరుగుతున్న రైతు ఆత్మహత్యలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మోటకొండూర్ మండల కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో రైతులు సుభిక్షంగా ఉన్నారని, రైతులకు పెట్టుబడి సాయం, 24 గంటల కరెంట్, సకాలంలో ఎరువుల పంపిణీలో ఎలాంటి సమస్య ఉండేది కాదని గుర్తు చేశారు. ఎకరాకి రూ.10వేల చొప్పున నాటువేసే సమయానికి పెట్టుబడి సాయం అందించారని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు పెట్టుబడి సాయం అందించకపోవడం బాధాకరమని, రైతులను మోసం చేస్తే పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. సాగు చేస్తేనే సాయం అనడం సరికాదని, ఎన్ని ఎకరాలకు అందిస్తారో నిర్ణయించి త్వరితగతిన ఇవ్వాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందు చూపు లేదని, రైతులకు కావాల్సినవి సమకూర్చడంలో విఫలమైందని తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్ మాట్లాడుతూ.. అన్ని రంగాలను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కారు తీరును ప్రజలు గమనిస్తున్నారని, అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం చేతకానితనానికి నిదర్శనమని అన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ పల్లా వెంకట్‌రెడ్డి, ఎంపీపీ పైళ్ల ఇందిరాసత్యనారాయణరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొట్ల యాదయ్య, ఎంపీటీసీ పన్నాల అంజిరెడ్డి, రైతు బంధు సమితి మాజీ కన్వీనర్ ఐలయ్య, నాయకులు బీస కృష్ణం రాజు, అనంతుల జంగారెడ్డి, ఎండీ బురాన్, మల్గ గౌరయ్య, నర్సింహులుయాదవ్, మంత్రి రాజు, పన్నాల నవీన్‌రెడ్డి, జివిలి కపల్లి వెంకటేశ్, లింగం, నర్సింహ, స్కైలాబ్‌రెడ్డి పాల్గొన్నారు.

యాదాద్రి మెడికల్ కాలేజీ కుదింపు

ఎంబీబీఎస్ సీట్లు, దవాఖాన పడకలను తగ్గించిన సర్కారు

- గతేడాదికి గుట్టకు మెడికల్ కాలేజీ మంజూరు
- 100 సీట్ల నుంచి 50 సీట్లకు కట్
- 300 బెడ్లకు బదులుగా 220 పడకలే..
- సరైన సదుపాయాలు లేవంటూ కోత
- ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు

యాదాద్రి మెడికల్ కాలేజీని రాష్ట్ర ప్రభుత్వం కుదించింది. బీఆర్ఎస్ హయాంలో మంజూరైన కళాశాలలో సీట్లు, హాస్పిటల్ బెడ్లకు కోత పెట్టింది. వంద ఎంబీబీఎస్ సీట్ల నుంచి 50 సీట్లకు తగ్గించారు. ఇక 300 పడకల ఆస్పత్రి నుంచి 220 పడకలకు మార్చారు. సరిపడా సదుపాయాలు లేకపోవడంతో తగ్గించినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా విద్యా సంవత్సరం నుంచే కాలేజీ అందుబాటులోకి రానుంది.

– యాదాద్రి భువనగిరి, జూలై 3 (నమస్తే తెలంగాణ)

గతేడాది జూన్5న మంజూరు

బీఆర్ఎస్ సర్కారు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున మెడికల్ కాలేజీలను నెలకొల్పింది. ఇందులో భాగంగా యాదగిరిగుట్టకు గతేడాది జూన్ 5న అప్పటి ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కళాశాల తరగతులు ప్రారంభం అవుతాయని జీఓలో పేర్కొంది. ఇక కాలేజీ నిర్మాణానికి రూ. 183 కోట్లు కేటాయిస్తూ పరిపాలనా అనుమతుల కోసం సెప్టెంబర్ 16న జీఓ నంబర్ 162 విడుదల చేసింది. అదే రోజు 433 పోస్టులను క్రియేట్ చేస్తూ జీఓ నంబర్ 124 రిలీజ్ చేసింది. ఇందులో అనుబంధ ఆస్పత్రి డీఎంఈ పరిధిలోకి వస్తుందని పేర్కొంది. ఆ తర్వాత శ్రీలక్ష్మీనరసింహ స్వామి మెడికల్ కాలేజీగా నామకరణం కూడా చేసింది. మెడికల్ కళాశాల ఏర్పాటుకు ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి ఎంతో కృషి చేశారు.

సరైన సదుపాయాల్లేవట..!

ఎంబీబీఎస్ సీట్లు, పడకల కుదింపు వాస్తవమేనని అధికారులు చెబుతున్నారు. సరైన సదుపాయాలు లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంటున్నారు. జనరల్ ఆస్పత్రిలో సరిపడా బెడ్లు లేవని, అందుకే తగ్గించినట్లు వివరిస్తున్నారు. సరైన ఫ్యాకల్టీ, స్టాఫ్ లేనందున సీట్లను కూడా కుదించినట్లు చెబుతున్నారు. ఢిల్లీ నుంచి తనిఖీలకు వచ్చినప్పుడు సరైన సదుపాయాలు లేకుంటే ఇబ్బందులు ఎదురవుతాయని, అందుకే తగ్గించినట్లు స్పష్టం చేస్తున్నారు. కాగా సూర్యాపేటలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసినప్పుడు సాధ్యమైనప్పుడు, యాదాద్రిలో ఎందుకు కాదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

మెడికల్ కాలేజీకి అనుమతులు మంజూరు చేసిన జీఓలోనే ఎంబీబీఎస్ సీట్ల గురించి ప్రస్తావించారు. జీఓ నంబర్ 85లో వంద ఎంబీబీఎస్ సీట్లకు మంజూరు ఇచ్చారు. దీనికి అనుబంధంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఉంటుందని తెలిపారు. అయితే ఇప్పుడు మాత్రం వంద నుంచి 50 ఎంబీబీఎస్ సీట్లకు కుదించారు. మెడికల్ కాలేజీ ప్రారంభం కానుండటంతో 50సీట్ల మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో విద్యార్థులు ఎంతగానో నష్టపోయే ప్రమాదం ఉంది. పేద విద్యార్థులకు ఎంబీబీఎస్ సీట్లు దక్కకుండా పోనున్నాయి. కాలేజీకి అనుబంధంగా భువనగిరి పట్టణంలో ఉన్న జిల్లా ఆస్పత్రి కొనసాగుతుంది. దీన్ని వైద్య విధాన పరిషత్ నుంచి డీఎంఈ పరిధిలోకి మార్చారు. తొలుత కాలేజీకి అనుబంధంగా 300 పడకల ఆస్పత్రి ఉండాలని నిర్ణయించారు. కానీ తాజాగా 220 పడకలకు కుదించారు.

ఏడాది నుంచే తరగతులకు సిద్ధం

యాదాద్రి మెడికల్ కాలేజీ ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభం కానుంది. నీట్ షెడ్యూల్ ఆధారంగా తరగతులు నడుస్తాయి. అయితే యాదగిరిగుట్టలో శాశ్వత భవన పనులు ఇంకా ప్రారంభం కాకపోవడంతో ప్రస్తుతానికి భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని పగిడిపల్లిలో ఉన్న పాత కలెక్టరేట్ భవనంలో కొనసాగించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం బిల్డింగ్‌ను అద్దెకు తీసుకున్నారు. మెడికల్ కాలేజీకి అనుగుణంగా మరమ్మతులు చేపడుతున్నారు.

యాదగిరిగుట్టలోనే మెడికల్ కాలేజీని ప్రారంభించాలి

- మంత్రి దామోదర రాజనర్సింహకు గొంగిడి సునీతామహేందర్ రెడ్డి వినతి

యాదాద్రి భువనగిరి, జూలై 3 (నమస్తే తెలంగాణ) : యాదాద్రి మెడికల్ కాలేజీ యాదగిరిగుట్టలోనే ఏర్పాటు చేయాలని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి కోరారు. హైదరాబాద్‌లో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను బుధవారం ఆమె యాదగిరిగుట్ట బీఆర్ఎస్ నేతలతో కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తూకు కూడా వినతిపత్రం సమర్పించారు. పవిత్ర పుణ్యక్షేత్రం అయిన యాదగిరిగుట్టలోనే మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలని గత సీఎం కేసీఆర్ గుట్టకు కాలేజీని మంజూరు చేశారని చెప్పారు. అంతకంటే ముందే 100 పడకల ఆస్పత్రిని శాంక్షన్ చేశారని గుర్తు చేశారు. వైద్య కళాశాల అనే బోర్డును పాత కలెక్టరేట్ భవనానికి ఏర్పాటు చేశారని, అధికారులను సంప్రదిస్తే అక్కడే ప్రారంభిస్తామని తెలిపారని చెప్పారు. ఇదే విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. యాదగిరిగుట్టలో కూడా ప్రభుత్వ భవనం ఉందని, ఇక్కడే కాలేజీని ప్రారంభించాలని కోరారు. పాలిటెక్నిక్ కాలేజీ భవనంలో బాలికలు, బాలుర హాస్టళ్లు నిరుపయోగంగా ఉన్నాయని, ఇక్కడ 42గదులు అందుబాటులో ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలని తెలిపారు. కళాశాల నిర్మాణం కూడా ఈ సంవత్సరమే ప్రారంభించాలని కోరినట్లు చెప్పారు. వంద పడకల ఆస్పత్రిని కూడా త్వరితగతిన ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు వినతిపత్రం

ఆత్మకూరు(ఎం),జూలై3 : చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు బుధవారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జల్లి రాములు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన త్రిఫ్ట్‌ఫండ్ పథకాన్ని కొనసాగించాలని, మహిళా కార్మికులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయాలని, చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలపై జీఎస్టీని రద్దు చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో పురుశోత్తం, శ్రీరాములు, కృష్ణమూర్తి, లింగయ్య, శ్రీనివాస్, దేవదాస్ ఉన్నారు.